లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

అడ్డగూడూరు, జూన్ 28 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 27 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతీఅయోధ్య, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు జి.జోసెఫ్, ఎంపీడీఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

మత్స్యాద్రిపై దుకాణాలకు బహిరంగ వేలం

రామన్నపేట (వలిగొండ), జూన్ 28 : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండపై 2024-25 సంవత్సరానికి వివిధ రకాల వస్తువులను అమ్ముకొనుటకు శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రత సామగ్రి హక్కులను రూ.8,77,889కు, బొమ్మలు, క్యాసెట్లు, మణిహారం హక్కులను 9,86,666 రూపాయలకు ముద్దాపురం గ్రామానికి దయాకర్‌రెడ్డి దక్కించుకున్నారు. వాహన పూజ హక్కులను రూ.5,50,000కు అరూరు గ్రామానికి చెందిన శివకుమార్, వాహన టోల్‌గేట్ హక్కులు 10,70,000 రూపాయలకు అరూరు గ్రామానికి చెందిన శోభారాణి, ఫొటో స్టూడియో నిర్వహణ రూ.91వేలకు జామచెట్లబావికి చెందిన నరేశ్ పాడారు. కూల్‌డ్రింక్స్, హోటల్ నిర్వహణకు 2,81,000 రూపాయలకు వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీను, పూలు, పూలదండలు అమ్ముకొనుటకు 2,36,666 రూపాయలకు ముద్దాపురం గ్రామానికి చెందిన దయాకర్‌రెడ్డి బహిరంగ వేలం పాటలో దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కులకు టెండర్‌దారులు పాల్గొననందున వేలాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ భువనగిరి డివిజన్ పరిశీలకురాలు సుమతి, దేవస్థానం ఈఓ మోహన్‌బాబు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యగిరి కొండపై నిర్వహిస్తున్న వేలంలో పాల్గొన్న టెండర్ దారులు

కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలని నిరసన

రామన్నపేట : కొత్త క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు న్యాయవాదులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన హక్కులను కొత్త చట్టాల ద్వారా కోల్పోతున్నామన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్వంచ జగతయ్య, గాలి లింగయ్య, నకిరేకంటి మొగులయ్య, యాదాసు యాదయ్య, దినేశ్‌కుమార్, శ్రవణ్, స్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

రామన్నపేట అడిషనల్ కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పోరాట ఫలితంగానే ప్లాట్ల పంపిణీకి హామీ : సీపీఐ

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, పేదలు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 28 : సీపీఐ పోరాటాల ఫలితంగానే ప్లాట్ల పంపిణీకి కలెక్టర్ హామీ ఇచ్చారని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బొమ్మాయిపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాన్ని పేదలకు ఇవ్వాలని శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ బెల్ షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో సర్వే చేసి లబ్ధిదారులకు స్థలాలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 118లోని ఖాళీ భూమిని బలహీన వర్గాలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ.. దానిని అమలు చేయడంలో అప్పటి ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. సంవత్సరం నుంచి చేస్తున్న పోరాటం ఫలితంగా ఇండ్ల స్థలాల పంపిణీకి కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి కొత్త ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, నాయకులు చింతల పెంటయ్య, రాములు, షర్ఫుద్దీన్, బాలయ్య, పోషాలు, బాలకృష్ణ, ఆండాలు, భారతమ్మ, అమృత, విజయ పాల్గొన్నారు

పాల సంఘం పాలకవర్గానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి సత్కారం



చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, జూన్ 28 : మండలంలోని ఇంద్రపాలనగరం పాల సంఘం డెరెక్టర్లుగా పగడాల రవిశంకర్, సింగనబోయిన అశోక్ గెలుపొందగా.. చైర్మన్‌గా సింగనబోయిన సత్యనారాయణ ఎంపికయ్యారు. వారు శుక్రవారం నార్కట్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు విక్రం, లింగస్వామి, వెంకటేశం, సత్యనారాయణ, రవిశంకర్, అశోక్, శ్రీకాంత్, మహేశ్, సాయిలు ఉన్నారు.

బొల్లెపల్లి పెద్ద చెరువు రాచకాల్వ గేటు అపహరణ

భువనగిరి కలెక్టరేట్, జూన్ 28 : చిన్నేరు వాగుపై బొల్లెపల్లి పెద్ద చెరువు కాల్వ కత్వకు గల బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన గేటు ఇనుప రాడ్లను, దిమ్మెలను పగుల గొట్టి అపహరించుకు పోయారు. అధికారులు విచారణ జరిపి గేటుకు మరమ్మతులు చేయాలని, రాచకాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించాలని, మూసీ నుంచి వచ్చే బొల్లెపల్లి కాల్వను త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. శుక్రవారం సిరివేణికుంట మాజీ సర్పంచ్ పడాల అనిత, కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల బాబురావు, బొర్ర ప్రభాకర్, రైతులు కాల్వను సందర్శించారు.

అపహరణకు గురైన గేట్లను పరిశీలిస్తున్న నాయకులు

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జూన్ 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా సాగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,29,075 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో వినాయక నాట్యమండలి సురభి వారి నాటకాలు భక్తులను అలరిస్తున్నాయి. కొండపైన తూర్పు మాడవీధుల్లో గల సాంస్కృతిక మండపంలో పాతాళ భైరవి నాటకం ప్రదర్శించారు. నాటకంలో పాతాళ భైరవి చరిత్రను కళ్లకు కట్టినట్టుగా చూపించారు.

పాతాళభైరవి నాటక ప్రదర్శన

అనుమతి ఉన్న ఆహార పదార్థాలు మాత్రమే విక్రయించాలి

- ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి

భూదాన్ పోచంపల్లి, జూన్ 28 : అనుమతి పొంది ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి హెచ్చరించారు. పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సూపర్ మార్కెట్‌లోని వస్తువులను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార పదార్థాలపై తయారైన తేదీ, గడువును తప్పకుండా పరిశీలించాలన్నారు. శాంపిల్‌గా తీసుకున్న వస్తువులను హైదరాబాద్‌లోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపిస్తామని, కల్తీ అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాల వ్యాపారులు, కిరాణం, బేకరీలు, స్వీట్ హౌజ్‌లు, బియ్యం, మాంసం, చేపలు విక్రయదారులు ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ ఎం.సుమన్ కళ్యాణ్ ఉన్నారు.

భూదాన్ పోచంపల్లి : రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి

సూపర్ మార్కెట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

చౌటుప్పల్ : పట్టణంలోని పలు సూపర్ మార్కెట్లలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ సుమన్ కళ్యాణ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వివిధ వస్తువులను పరిశీలించి తయారు చేసిన, ముగిసిన తేదీలు తప్పకుండా ఉండాలని సూచించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పొందిన పదార్థాలను మాత్రమే విక్రయించాలన్నారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని వస్తువుల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని టెస్టింగ్ ల్యాబ్‌కు తరలించారు.

పాల ధరను పెంచాలి

రాజాపేట, జూన్ 28 : పాల ధర లీటరుకు రూ.4 పెంచి పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని మదర్ డెయిరీ డైరెక్టర్లు అర్కాల గాల్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులు పడుతున్న సమస్యలను వివరించారు. అదేవిధంగా మండలంలోని పొట్టిమర్రి, బేగంపేట, పారుపల్లి వాగులపై వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పొట్టిమర్రి - చల్లూరు మీదుగా ఇబ్రహీంపూర్ డబుల్ రోడ్డు, మల్లెగూడెం బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్‌ను కలిసిన వారిలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మొత్కుపల్లి జ్యోతిప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పాండవుల భానుప్రకాశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ కాయితి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు బొందుగుల స్వామి ఉన్నారు.

ప్రభుత్వ విప్ ఐలయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మదర్ డెయిరీ డైరెక్టర్లు గాల్‌రెడ్డి, రాంరెడ్డి

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, జూన్ 28 : పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో సొసైటీ ఆదాయ, వ్యయాలు, ధాన్యం కొనుగోళ్ల వివరాలు, ఎరువుల విక్రయాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దుబ్బాక శశిధర్‌రెడ్డి, గుండెబోయిన రూపమ్మ, పబ్బతి వెంకటేశం గౌడ్, దొడ్డి శ్రీశైలం, పానుగోతు సూర, దొడి బాలరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దామోదర్‌రెడ్డి

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

- బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

మోటకొండూర్, జూన్ 28 : ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలును అరికట్టాలని బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలును నియంత్రించాలని శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీ సత్తిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు తీసుకునే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బొట్ల ప్రశాంత్, బొట్ల పాండు, గంధమల్ల రాజు ఉన్నారు.



ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీ సత్తిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్‌వై నాయకులు

ఒకేసారి రుణమాఫీ చేయాలి : బీఆర్ఎస్

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భిక్షపతి

ఆత్మకూరు(ఎం), జూన్ 28 : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోరె భిక్షపతి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కోతల కరెంట్‌తో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, నాయకులు దశరథగౌడ్, ఎండీ అజీమొద్దీన్ పాల్గొన్నారు.

అండర్ పాస్ వంతెనలు ఏర్పాటు చేయాలి

- మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి వినతి

భువనగిరి అర్బన్, జూన్ 28 : నియోజకవర్గంలో అవసరమున్న చోట అండర్ పాస్ వంతెనలు ఏర్పాటు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. భువనగిరి సమీపంలోని వరంగల్ హైవే రామక్రిష్ణాపురం రోడ్డు మార్గం, సింగన్నగూడెం చౌరస్తా, బీబీనగర్ మండలం కొండమడుగు వద్ద, విజయవాడ హైవే పోచంపల్లి రోడ్డు కొత్తగూడెం వద్ద అండర్ పాస్ బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మోత్కూరు, జూన్ 28 : మున్సిపాలిటీలో రహదారికి ఇరువైపులా ఉన్న లైన్ల సర్దుబాటులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు కొత్త స్తంభాలకు లైన్లను మార్చనున్నందున ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో 77శాతం ఉత్తీర్ణత

భువనగిరి అర్బన్, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 77శాతం ఉత్తీర్ణత సాధించారు. జూన్ 3నుంచి 13వరకు జిల్లాలో మూడు కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్షలకు 967 మంది విద్యార్థులు హాజరు కాగా, 744 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 607 మంది బాలురకు గాను 466 మంది పాస్ అయ్యారు. 360 మంది బాలికలకు గాను 278 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి తెలిపారు.

సూరేపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

భువనగిరి అర్బన్, జూన్ 28 : భువనగిరి బస్టాండ్ నుంచి మండలంలోని సూరేపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవి కోరారు. ఈ మేరకు శుక్రవారం భువనగిరి బస్టాండ్ కంట్రోలర్ లింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ సూరేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ ఆటోలు, ఇతర వాహనాల ద్వారా వెళ్తున్నారని తెలిపారు. త్వరలోనే సూరేపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని కంట్రోలర్ హామీ ఇచ్చినట్లు చిరంజీవి తెలిపారు.

పోచంపల్లి బ్యాంకు నూతన పాలకవర్గానికి సన్మానం

భూదాన్ పోచంపల్లి, జూన్ 28 : పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన పాలకవర్గాన్ని పట్టణంలో పోచంపల్లి చేనేత కార్మిక చీరెల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు . ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ మాట్లాడుతూ పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. బ్యాంకు వాటాదారులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అంకమురళి, అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలాది యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఏలె పాండు పాల్గొన్నారు.

మోటకొండూరు మసీదు కమిటీ

మోటకొండూరు, జూన్ 28 : మండల కేంద్రంలోని మసీదు ఏరహమానియ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ బురాన్, ఉపాధ్యక్షులుగా అఫ్జల్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ షానూర్ బాబా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా షేక్ అన్వర్, కోశాధికారిగా చాంద్‌పాషా, కార్యవర్గ సభ్యులుగా లతీఫ్, జహంగీర్, మస్తాన్, సుబానీ, అంకుశ్‌ను ఎన్నుకున్నారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భూదాన్ పోచంపల్లి, జూన్ 28 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. భూదాన్ పోచంపల్లి తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ధరణిలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తాసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్లను పరిశీలించి తప్పులు దొర్లకుండా స్పష్టమైన వివరాలు ఉండేలా చూడాలని సూచించారు. కార్యాలయంలో ఫైల్ పెండింగ్‌లో ఉన్నాయని ఫైళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సైదిరెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, సర్వేయర్ సాయికుమార్ ఉన్నారు.

పోచంపల్లి తాసీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

క్రీడలతో మేథోశక్తి పెరుగుదల

- జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు

భువనగిరి అర్బన్, జూన్ 28 : క్రీడలతో విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు అన్నారు. జిల్లాలో నాలుగో తరగతి స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాల కోసం మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడా పోటీల్లో రాణించాలన్నారు. ఈ పోటీల్లో సుమారు 120 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన బాల బాలికలను జూలై 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాలకృష్ణ, పీడీలు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి ధనుంజనేయులు

పచ్చిరొట్ట సాగుతో భూసారం

ఆలేరు రూరల్, జూన్ 28 : పచ్చిరొట్ట పంటల సాగుతో భూమికి జవసత్వాలు చేకూరుతాయని డీఏఓ అనూరాధ అన్నారు. మండలంలోని కొలనుపాక గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన పచ్చిరొట్ట పంటను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి వేయడానికి ముందు తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగు చేయాలని, దాంతో సేంద్రియ కర్బన నిల్వలు పెరిగి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. అనంతరం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అధీకృత డీలర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఓ దీప్తి ఉన్నారు.

కొలనుపాకలో జీలుగ సాగును పరిశీలిస్తున్న డీఏఓ అనూరాధ

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూన్ 28 : పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని చెరుకుబావి వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ బోర్డును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గూగుల్ ద్వారా కాలనీల్లో సులభంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఈ బోర్డులు ఉపయోగపడుతాయని, అన్ని కాలనీల్లో వీటిని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, ఏఈ వెనిల్‌కుమార్, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ ఆలె నాగరాజు, నాయకులు బాలకృష్ణగౌడ్, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

స్ట్రీట్ బోర్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

అన్ని వార్డులను దశల వారీగా అభివృద్ధి చేస్తా

- మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, జూన్ 28 : మున్సిపాలిటీలోని అన్ని వార్డులను దశల వారీగా అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వార్డులను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలి

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి

భూదాన్ పోచంపల్లి, జూన్ 28 : విద్యుత్ ఉద్యోగులకు మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పగిడం యాదగిరి, ప్రాంతీయ కార్యదర్శి ఎస్.అమర్నాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పోచంపల్లి సెక్షన్ విద్యుత్ కార్యాలయం వద్ద తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ (1104) యూనియన్ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పనిచేసే ఉద్యోగులకు యాజమాన్యం భద్రతా పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు వెంకటేశం, జిల్లా అదనపు కార్యదర్శి ఎ.తిరుమలయ్య, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ డివిజన్ కార్యదర్శి గంగుల సోమేశ్వర్ రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నర్సాపురం పాల సంఘం చైర్మన్‌గా బాపిరెడ్డి

రాజాపేట : మండలంలోని నర్సాపురం పాల సొసైటీ చైర్మన్‌గా రామిడి బాపిరెడ్డిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా యమ్మ శ్రీను, గద్ద శేఖర్ ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లను పాల ఉత్పత్తిదారులు సన్మానించారు. వారికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్ అభినందనలు తెలిపారు.